# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

మంగళవారం | 29 ఏప్రిల్ 2025 | పేజీలు 8






దుండిగల్ మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళికా విభాగం అవసరం లేదేమో అనిపిస్తుంది.. ఇక్కడ అనుమతులు ఇచ్చినా అక్రమమే..!ఇవ్వకపోయినా అక్రమమే..! అధికరుల చర్యలు అంతగా ఉండవనే చెప్పాలి..! అధికారులను ప్రసన్నం చేసుకోకపోతే కదా..? చర్యలు తీసుకునేది..! అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు చెందిన అక్రమ నిర్మాణాలకు..! వారి సిఫార్సులు ఉన్నవారి అక్రమ కట్టడాలకు..! దుండిగల్ పట్టణ ప్రణాళిక ప్రత్యేకంగా రక్షణ కల్పిస్తుందని..! చర్యలకు మినహాయింపు ఉంటుందని..! బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో బాస్కర్‌రెడ్డి అపార్ట్‌మెంట్‌లో నారాయణ పాఠశాల..బౌరంపేట్ ఎస్ఆర్‌కే వెంచర్ కమాన్ పక్కన అక్రమ సెల్లార్‌తో నిర్మాణం, కన్జర్వేషన్ జోన్‌లో వ్యాసా స్కూల్ నిర్వహణతో నిరూపిస్తున్నారు..! అదేవిధంగా వందలాది అక్రమ నిర్మాణాలు సాక్ష్యాలుగా కూడా ఉన్నాయి అనడంలో అతిశయోక్తి కాదు.. టౌన్‌ప్లానింగ్ అధికారుల ప్రత్యేకత ఏమిటంటే..! ప్రమాదకర అక్రమ కట్టడాలపై వార్తా కథనాలు వచ్చినా..! ఫిర్యాదులు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు.. ఉడత భక్తి ప్రదర్శించి మెప్పు పొందడం ఇక్కడ ఆనవాయితీ..! బహుదూర్‌పల్లిలో ఓ బీఆర్ఎస్ నేతకు చెందిన అక్రమ కట్టడాల విషయంలో "హెచ్ఎండిఏ-లోకల్‌బాడీ" నుండి చర్యలకు ఆదేశాలు ఉన్నప్పటికీ..! బహిరంగంగానే సహకరించి ప్రస్తుతం ఆ మూడు అక్రమ నిర్మాణాలు తుదిదశకు వచ్చాయి.. అయినా చర్యలు లేవు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 28:

ఫిర్యాదులు బేఖాతర్ చేస్తూ.. సోమవారం నాటికి ఇలా.. స్లాబ్ పూర్తి చేయడమే తరువాయి..




# టౌన్‌ప్లానింగ్ అండ ఉండగా..! భయమెందుకు దండగ..!

అనుమత్తుల్లేని అక్రమ నిర్మాణాలపై దుండిగల్ మున్సిపల్ ఉదాసీనత..!

- బహుదూర్‌పల్లి పరిధి నర్సాపూర్ హైవే పక్కనే పర్మిషన్ లేని అక్రమ నిర్మాణం..
- 200 ఫీట్ల నర్సాపూర్ ప్రధాన రహదారి ఎఫెక్ట్‌లో సుమారు 50 ఫీట్లు ఆక్రమణ..?
- 23 ఏప్రిల్ 2025న టౌన్‌ప్లానింగ్ అధికారిని వివరణ కోరినా నేటికీ సమాధానం శూన్యం..
- మరోవైపు 28 ఏప్రిల్ 2025 నాటికి అక్రమ కట్టడంలో యధేచ్చగా పనుల వృద్ధి..
- టౌన్‌ప్లానింగ్ అధికారి సంజున మేడమ్ ఫోన్‌లు ఎత్తరు సమాధానం చెప్పరు..!


-2లో





ఐదు రోజుల క్రితం ఇలా ఉన్నప్పుడే అధికారుల దృష్టికి..

# మల్లంపేట్ రోడ్డు విస్తరణలో.. స్వల్ప ఉద్రిక్తత..

## ఆక్రమణల కూల్చివేతలు అడ్డుకున్న స్థానికులు..



- గత ప్రభుత్వం హయాంలోనే బాచుపల్లి టు ఓఆర్ఆర్ వరకు 100 ఫిట్ల రోడ్డు సాంక్షన్..
- అటు బౌరంపేట్ నుండి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు 100 పీట్ల రోడ్డు పనులు పూర్తి..!
- ఇటు బాచుపల్లి నుండి మల్లంపేట్ గ్రామం వరకు పనులు పూర్తి చేశారు..
- మల్లంపేట్ విలేజ్‌లో మాత్రం స్థానికుల వ్యతిరేకతతో పనులు నిలిచిపోయాయి..
- సోమవారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, మున్సిపల్ చర్యలు..


-3లో


# దారికాచి దోచుకున్నారు.. కటకటాల పాలయ్యారు..

## ఐదురోజుల్లో రాబరీ కేసును ఛేదించిన దుండిగల్ పోలీసులు..

- ఆలీబాబా అరడజన్ దొంగల అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు..
- రూ.5.25 లక్షలు,నకిలీ పిస్టల్, ఓ కత్తి. ఫోర్డ్ కార్, 7 సెల్ ఫోన్‌లు స్వాధీనం..
- నిందితులపై పలు సెక్షన్‌ల కింద కేసునమోదు రిమాండ్‌కి తరలింపు..
- యు.ఎస్ 309(4),319(2),140(3) సెక్షన్ 25(1బి),ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు..
- నిందితులు అందరూ సంగారెడ్డికి చెందిన వారుగా దుండిగల్ డిఐ సతీష్ ప్రెస్‌మీట్..




-4లో

# టౌన్‌ప్లానింగ్ అండ ఉండగా..! భయమెందుకు దండగ..!




అనుమతుల్లేని అక్రమ నిర్మాణం.. హైవే రోడ్డు ఎఫెక్ట్‌లో కమర్షియల్ కాంప్లెక్స్..




పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్ కంటే కూడా హైవే వైపు నిర్మాణం..

## హైవేపై వాహనాలు అదుపు తప్పితే..?

బహుదూర్‌పల్లి మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్ పక్కన నిర్మించే, అక్రమ కట్టడంపై అధికారుల నిర్లక్ష్యం పతాక స్థాయికి చేరుకుంది.. ప్రమాదాలను ప్రోత్సహించే విధంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు.. నర్సాపూర్ హైవే రోడ్డు పోగా, నిర్మాణానికి కనీస సెట్‌బ్యాకులు సమారు 20-30 ఫీట్లు వదలాలి.. మొత్తం దాదాపు రోడ్డుతో కలుపుకుని, దాదాపు 50 ఫీట్లకు పైగా వెనక్కిజరిగి నిర్మాణం చేపట్టాలి.. సెట్‌బ్యాకులు కూడా పాటించడం లేదు.. అసలైన ప్రమాదం ఇక్కడే పొంచిఉంది.. సంబంధిత అక్రమ నిర్మాణం, హైవే మూల మలుపు మీదనే ఉండటం అత్యంత ప్రమాదకరం.. వేగంగా దూసుకెళ్ళే వాహనాలు అదుపు తప్పితే పరిస్థితి ఏంటి..? ప్రమాద వశాత్తు సంబంధిత నిర్మాణం లోకి వాహనాలు దూసుకెళ్ళే అవకాశం లేకపోలేదు.. ఏదిఏమైనప్పటికీ దుండిగల్ మున్సిపల్ అధికారులు, నేతల మెప్పుపొందే క్రమంలో..! ప్రమాదకర అక్రమ నిర్మాణాలను కూడా ప్రోత్సహిస్తున్నారని గమనించాలి..

## అనుమతుల్లేని అక్రమ నిర్మాణంపై టౌన్‌ప్లానింగ్ నిర్లక్ష్యం..

దుండిగల్ మున్సిపల్ బహుదూర్‌పల్లి పరిధిలోని, మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్ పక్కనే..! 200 ఫీట్ల రోడ్డు నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కన నిర్మించే, ఓ భారీ అక్రమ కట్టడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు బహిరంగంగానే సహకరిస్తున్నారని స్పష్టమవుతుంది.. ఓ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నేత సుమారు 700 గజాల స్థలంలో..! మున్సిపల్ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, దర్జాగా అక్రమ నిర్మాణం చేపడుతున్నారు.. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ అండ్ టౌన్‌ప్లానింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం శూన్యం.. అధికార పార్టీ నేత అయినందునే చర్యలు తీసుకోవడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపల్ అధికారులు టిజి-బిపాస్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.. మున్సిపల్ ఆవిర్భావం నుండి అధికారులు ఎవరు విధుల్లో ఉన్నా..! అక్రమ కట్టడాలకే ప్రాధాన్యత ఇవ్వడం ఇక్కడ ఆనవాయితీ..! విధుల్లో చేరిన ప్రతి అధికారి ఆ ప్రాంత నేతలను పదవులు లేకపోయినా కలవడంపై కొందరు అధికారులు విమర్శల పాలయ్యారు.. అక్రమ నిర్మాణాలపై వార్తలు వచ్చినా పెద్దగా పట్టించుకోరు.. అమాస్యకి, పౌర్ణమికి అన్నట్టు అప్పుడప్పుడు చర్యలకు దిగుతారు.. లేకపోతే అదికూడా లేనట్టే..! చర్యలు తప్పనిసరి అయితే మాత్రం పై అధికారులకి నివేదిక పంపించేందుకు ఫోటోషూట్ చర్యలతో మమా అనిపించినవి కోకొల్లలు.. ఒక రిపోర్ట్‌తో పాటు నాలుగు ఫోటోలు జోడించి మమా అనిపించి చేతులు దులుపు కుంటారు.. ఎందుకంటే లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ నిర్మాణాలు పరిశీలించిన దాఖలాలు అరుదు.. ఒకవేళ పాక్షిక చర్యలు చేపట్టినా వీలైనంత వరకు ఫోటోలు గోప్యంగా ఉంచడం దుండిగల్ మున్సిపల్ అధికారుల మరో ప్రత్యేకత.. టౌన్‌ప్లానింగ్ అధికారుల నమ్మకం ఏంటంటే పై అధికారుల సందర్శించరు, వీళ్ళు పంపించిందే ఫైనల్.. చివరికి ఇక్కడ నేతల సిఫార్సులు, పైనుండి ప్రెజర్ ఉందని బుకాయించడం అధికారుల విధుల్లో భాగంగా చేర్చారు..

## 200 ఫీట్ల నర్సాపూర్ హైవే ఎఫెక్ట్‌లో.. ఈ అక్రమ నిర్మాణం..?

దుండిగల్ మున్సిపల్ అధికారులు "చేతులు కాలాక ఆకులు పట్టుకున్న" చందంగా వ్యవహరిస్తున్నారు.. అక్రమ కట్టడాలను ఆరంభంలో నియంత్రించకుండా చోద్యం చూసి..! ఆతర్వాత రోడ్డు ఆక్రమణల పేరుతో, తర్వాత వచ్చే అధికారులు కూల్చివేతలు, అడ్డుకోవడాలు చవిచూస్తారు.. సోమవారం మల్లంపేట్ రోడ్డు కబ్జాలను తొలగించే క్రమంలో ఇదే ఎదురైందట.. స్వల్పంగా ఆటంకం ఏర్పడినట్టు సమాచారం.. మల్లంపేట్ తరహాలోనే ఇపుడు నర్సాపూర్ హైవే ఆక్రమణ భవిష్యత్తు ప్రమాదాలకు కారణం కానున్నది.. 200 ఫీట్ల రోడ్డుగా, 2018లోనే హెచ్‌ఎండిఏ నిర్ధారించింది.. ప్రస్తుతం ఉన్నరోడ్డు 150 ఫీట్లు ఉంటుంది.. రహదారికి ఇరువైపులా 25 ఫిట్ల చొప్పున వెడల్పు విస్తరించాల్సి ఉంది.. ప్రస్తుతం మాజీ సర్పంచ్ నిర్మించే అక్రమ భారీ నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు లేనప్పటికీ..! కనీస నిబంధనలు కూడా విస్మరిస్తున్నారు..

# షాహిద్ ఆఫ్రిది పెద్ద జోకర్.. పనికిమాలినోడు: అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్ పెన్ పవర్:భారత ప్రభుత్వం, సైన్యంపై నోరు పారేసుకున్న పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిదికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అతనో పెద్ద జోకర్ అని, పనికిరాని వాడు అంటూ విమర్శించారు. పనికిరాని వాళ్ల గురించి మాట్లాడడం సమయం వృథా తప్ప ఏమీ ఉండదని అన్నారు.

పహల్గామ్ ఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వంపై ఆఫ్రిది తీవ్ర విమర్శలు చేశారు. అలాగే ఇండియన్ ఆర్మీని కూడా దూషించాడు. భారత సైన్యం చేతగానితనం, వైఫల్యం కారణంగానే దాడి జరిగిందని వ్యాఖ్యానించాడు. భారత ప్రభుత్వం తన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిసారి పాకిస్థాన్‌పై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందని ఆఫ్రిది అన్నాడు. మాజీ క్రికెటర్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ.. వాడు పెద్ద జోకర్ అంటూ విమర్శించారు. అలాగే దాయాది దేశంపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సైబర్ దాడులతో పాటు సెల్ఫ్ డిఫెన్స్ కింద మిలిటరీ యాక్షన్ తీసుకోవాలన్నారు. పాక్‌ను ఆర్థికంగా బలహీనపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీని కోరారు. మతం పేరిట అమాయకులను చంపితే ఏ దేశం కూడా చూస్తూ ఊరుకోదని ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు.



మల్లంపేట్‌లో100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో అడ్డంకులు తొలగింపు..

# మల్లంపేట్ రోడ్డు విస్తరణలో... స్వల్ప ఉద్రిక్తత



రోడ్డు విస్తరణ పనుల్లో పాల్గొన్న పోలీసులు..

## ఆక్రమణల కూల్చివేతలు అడ్డుకున్న స్థానికులు..

ఏదిఏమైనప్పటికీ 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు ఆ విలేజ్ లోపల వరకు 60 ఫీట్లకి కుదించినప్పటికీ..! స్థానికులు తమ ఇళ్ళు కూలిపోతాయని అడ్డుకోవడంతో 40 ఫీట్ల రోడ్డుకే పరిమితం చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తుంది.. అదే జరిగితే మల్లంపేట్ అభివృద్ధి ఇరుకు రోడ్లతో ట్రాఫిక్ జామ్ మళ్ళీ మొదలైనట్లే, అందుకే అక్రమ నిర్మాణాలకు సిఫార్సులు చేసిన నేతలు..! గుడ్డిగా సహకరించిన మున్సిపల్ అధికారులు, పోలీసులు కలిసి, పునరాలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.. కొందరికోసం అందరిని ట్రాఫిక్‌తో ఇబ్బందులకు గురి చేయవద్దని స్థానికులు సూచిస్తున్నారు..

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 28:** పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో పాటు మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపులో పాల్గొన్నారు.. సోమవారం ఉదయం స్వల్ప ఉద్రిక్తత, అడ్డంకులు ఏర్పడ్డాయి..! మరోవైపు ఇప్పటికే ఓ మాజీ కౌన్సిలర్, రెండేళ్ళ క్రితం మున్సిపల్ నిధులతో సుమారు రూ.7.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్డుకి అడ్డంగా గేటును నిర్మించారు.. సంబంధిత మాజీ కౌన్సిలర్ బీఆర్ఎస్ పార్టీ అయినందున..! మున్సిపల్ అధికారుల సహకారంతో నేటికీ గేటును తొలగించక పోవడం విశేషం.. సోమవారం రోడ్డు విస్తరణ అడ్డంకులను తొలగించే క్రమంలో..!

స్థానికులు అడ్డుకున్నట్టు సమాచారం.. వివరాల్లోకి వెళ్ళితే.. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బౌరంపేట్ నుండి మల్లంపేట్ మీదుగా బాచుపల్లి వరకు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే 100 ఫీట్ల రోడ్డుని సాంక్షన్ చేశారు.. అయితే బౌరంపేట్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు అడ్డంకులను తొలగించి 100 ఫీట్ల రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి.. అటు బాచుపల్లి నుండి మల్లంపేట్ వరకు 100 ఫీట్ల రోడ్డు పూర్తైంది.. కానీ మల్లంపేట్ గ్రామంలో 100 ఫీట్ల రోడ్డు కుదించినట్టు సమాచారం..





- గత ప్రభుత్వం హయాంలోనే బాచుపల్లి టు ఓఆర్ఆర్ వరకు 100 ఫీట్ల రోడ్డు సాంక్షన్..
- అటు బౌరంపేట్ నుండి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు 100 ఫీట్ల రోడ్డు పనులు పూర్తి..!
- ఇటు బాచుపల్లి నుండి మల్లంపేట్ గ్రామం వరకు పనులు పూర్తి చేశారు..
- మల్లంపేట్ విలేజ్‌లో మాత్రం స్థానికుల వ్యతిరేకతతో పనులు నిలిచిపోయాయి..
- సోమవారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, మున్సిపల్ చర్యలు..

### మల్లంపేట్ గ్రామంలో 60 ఫీట్లకు రోడ్డును కుదించినా..! ఆటంకాలే..!

దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల ఘనకార్యంతో..! 100 ఫీట్ల రోడ్డు కాస్త, 60 ఫీట్లకు కుదించడానికి ప్రధాన కారణంగా ఆరోపణలు ఉన్నాయి.. 100 ఫీట్ల రోడ్డు ప్రపోజల్ ఉన్నప్పటికీ, ఆ దారిలో అక్రమ నిర్మాణాలను విచ్చలవిడిగా ప్రోత్సాహించిన ఘనత మాత్రం మున్సిపల్ అధికారులదే.. అదే ఇప్పుడు అడ్డంకులు సృష్టిస్తోంది.. నిజానికి మల్లంపేట్ గ్రామంలో ఉన్నది 20 ఫీట్ల రోడ్డు మాత్రమేనట.. ప్రస్తుతం 100 ఫీట్లు విస్తరించాలంటే ఇరువైపులా కనీసం 40 ఫీట్లు ఆక్రమణలను తొలగించాల్సిందే..! కానీ అక్కడ నియంతృత్వ విధానాలు కొనసాగుతున్నాయని స్పష్టమవుతుంది.. కేవలం మున్సిపల్ నిర్లక్ష్యంతో, రోడ్డుకి ఇరువైపులా నూతన భవన నిర్మాణాలు చేపట్టారు.. ప్రస్తుతం అవే నిర్మాణాలు మల్లంపేట్ 100 ఫీట్ల రోడ్డుకు అడ్డంకులుగా మారాయి.. దీంతో 100 ఫీట్ల రోడ్డు కాస్త 60 ఫీట్లకు కుదించినట్లు సమాచారం.. మరో సంచలన విషయం ఏంటంటే..! 60 ఫీట్లు నిర్ణయించినా..! ప్రస్తుతం 40 ఫీట్లు విస్తరించడమే కష్టంగా తయారైందని అనధికారిక సమాచారం..

పెన్ పవర్ 29 మంగళవారం, ఏప్రిల్ 2025

# దారికాచి దోచుకున్నారు.. కటకటాల పాలయ్యారు..

## ఐదురోజుల్లో రాబరీ కేసును ఛేదించిన దుండిగల్ పోలీసులు..



పట్టుబడిన దోపిడీ దొంగల ముఠాతో దుండిగల్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సతీష్..



క్రైమ్ టీమ్‌తో డిఐ సతీష్..

- ఆలీబాబా అరడజన్ దొంగల అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు..
- రూ.5.25 లక్షలు,నకిలీ పిస్టల్, ఓ కత్తి. ఫోర్డ్ కార్, 7 సెల్ ఫోన్‌లు స్వాధీనం..
- నిందితులపై పలు సెక్షన్‌ల కింద కేసునమోదు రిమాండ్‌కి తరలింపు..
- యు.ఎస్ 309(4),319(2),140(3) సెక్షన్ 25(1బి),ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు..
- నిందితులు అందరూ సంగారెడ్డికి చెందిన వారుగా దుండిగల్ డిఐ సతీష్ ప్రెస్‌మీట్..



నిందితుల నుండి రికవరీ చేసిన నగదు, నకిలీ పిస్టల్, ఒక ఖడ్గము..

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 28:** దారికాచి ఓ వ్యక్తి దగ్గర బలవంతంగా రూ.5.25 లక్షలు దోచుకున్న సంఘటనకు సంబంధించి ఐదు రోజుల్లోనే కేసును ఛేదించి..! దోపిడీ దొంగల ముఠాలో ఆరుగురిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు దుండిగల్ క్రైం డిఐ సతీష్ సోమవారం వివరాలు వెల్లడించారు.. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం..

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి కొంపల్లిలోని అపర్ణ సానిటరిలో తరుణ్, వినోద్ కుమార్ పక్క పక్కనే ఇళ్ళలో ఉండే వీరిద్దరు.. ఐదేళ్ళ క్రితం ఓ వ్యాపారాన్ని ప్రారంభించారు.. తరుణ్ అందులో రూ..50 లక్ష్యలు పెట్టుబడి పెట్టినట్టు సమాచారం.. వ్యాపారం నుండి తప్పుకున్న వినోద్ కుమార్ న్యూజిల్యాండ్ వెళ్లి బిట్ కాయిన్ వ్యాపారంలో బాగా సంపాదించి తిరిగి ఇండియాకు వచ్చాడు.. ఈ నేపథ్యంలోనే అతని దగ్గర నుండి డబ్బులు గుంజాలని తరుణ్ గ్యాంగ్ పథకం వేసింది ఇందులో భాగంగా హైదరాబాద్‌కి చెందిన సాయి కృష్ణ, వివేక్ రాజ్ సింగ్, సంగారెడ్డికి చెందిన సందీప్, మన్‌దీప్, ఎన్. దేవేందర్, సుమంత్ మరో వ్యక్తితో పథకం పన్నేనారు.. ఈ పథకంలో భాగంగా అతను ఎక్కడ ఎక్కడ తిరుగుతున్నాడో, రెక్కీ నిర్వహించారు.. ప్రగతి నగర్‌లో ఉంటున్న బాధితుడు వినోద్ కుమార్ ఈ నెల 23న కొంపల్లి లోని అపర్ణ సానిటరీకి వెల్లుతున్నాడనే సమాచారంతో..! సందీప్ మన్‌దీప్, వివేక్, దేవేందర్, మనోజ్ తదితరులు వెంబడించి, కొంపల్లికి వెళ్లిన అతను తిరిగి అతని కారులో ప్రగతి నగర్‌కు వస్తుండగా..! బౌరంపేట స్నేక్ పార్క్ వద్దకు రాగానే, నిందితులు వినోద్ కుమార్ కారును (టీఎస్09ఎఫ్ క్యూ 4567) కారుతో ఢీకొట్టారు, డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన నిందితులు అతనిని కారులో ఫారెస్ట్ ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించి అతని అకౌంట్ నుండి బలవంతంగా వేరే వ్యక్తి అకౌంట్‌కి రూ.5.25 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నట్లు పోలీసుల విషారణలో తేలినట్లు డిఐ సతీష్ తెలిపారు.. ఆ మొత్తాన్ని సందీప్, మన్‌దీప్, దేవేందర్, మనోజ్‌లు సమానంగా పంచుకున్నట్లు పోలీస్ విచారణలో వెల్లడయింది.. బాధితుడు ఈ నెల 24న జే.ఎన్.టి.యు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.. ఈ నెల 28న ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, విచారించగా నేరం అంగీకరించినట్లు క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సతీష్ పేర్కొన్నారు.. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న జె ఎన్ టి యు పోలీస్ లు విచారణ నిమిత్తం దుండిగల్ క్రైం పోలీస్‌లకు బదిలీ చేశారు, విశ్వసనీయ సమాచారంతో ఈ నెల 28న నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి వద్ద నుండి రూ.5.25 లక్ష్యల నగదు, ఒక నకిలీ రివాల్వర్, ఓ కత్తి, ఫోర్డ్ కార్, 7 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేరుకొని పలు సెక్షన్‌లకింద కేసు నమోదు చేశారు.. క్రైం నెంబర్ 433/2025,అండర్ సెక్షన్ 309(4),319(2),140(3) బిఎన్ఎస్ సెక్షన్ 25(1బి),ఆర్మ్స్ యాక్ట్ కింద నమోదు చేసి ఆరుగురు నిందితులను రిమాండ్ కు తరలించారు.. మరో ఇద్దరు నిందితులు తరుణ్, మనోజ్ పరారీలో ఉన్నట్లు పోలీస్ లు తెలిపారు.

# రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదన్న జగ్గారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, గాంధీ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్ తన గతాన్ని పూర్తిగా మర్చిపోయి మాట్లాడుతున్నారని, రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత ఆయనకు లేదని జగ్గారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సభలో గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి కేసీఆర్ 'డూప్లికేట్ గాంధీలు' అని చేసిన వ్యాఖ్యలపై జగ్గారెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "కేసీఆర్ వయసులో పెద్దవారు. మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలి. రాహుల్ గాంధీ కుటుంబానికి దేశంలో ఓ ప్రత్యేక చరిత్ర ఉంది. వారిపై విమర్శలు చేసి కేసీఆర్ తనకున్న కొద్దిపాటి గౌరవాన్ని కూడా పోగొట్టుకోవద్దు" అని జగ్గారెడ్డి హితవు పలికారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం గతంలో కేసీఆర్ చేసిన ప్రయత్నాలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి గుర్తుచేశారు. "ప్రత్యేక రాష్ట్రం కోసం సోనియా గాంధీ,

రాహుల్ గాంధీ ఇళ్ల చుట్టూ తిరిగిన రోజులు కేసీఆర్ మర్చిపోయారా? వారి అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి ఢిల్లీలో పడిగాపులు కాసిన సంగతి గుర్తులేదా? రాష్ట్ర విభజనకు ముందు వారు ఒరిజినల్ గాంధీలు, ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు అయ్యారా?

ఇదేనా కేసీఆర్ రాజకీయ విలువలు?" అని జగ్గారెడ్డి ఘాటుగా ప్రశ్నించారు.రాజకీయాల్లో ప్రజల పక్షాన నిలిచే హీరో పాత్రను, ప్రజా వ్యతిరేక శక్తుల పాలిట విలన్ పాత్రను కాంగ్రెస్ పార్టీనే పోషిస్తుందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ వ్యాఖ్యలు ఆయన స్థాయికి తగవని, రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలని సూచించారు.

# తప్పుడు డ్రగ్స్ కేసు: 72 రోజుల జైలు జీవితం.. అసలు సూత్రధారి అరెస్ట్‌తో ఊరట!

**హైదరాబాద్ పెన్ పవర్:**తన తప్పేమీ లేకపోయినా, ఎవరో చేసిన కుట్ర వల్ల జీవితం తలకిందులైంది. చేయని నేరానికి 72 రోజులు జైలు ఊచలు లెక్కపెట్టారు. సమాజంలో పరువు పోయింది, ఉపాధి దూరమైంది. రెండేళ్లకు పైగా నరకం అనుభవించిన కేరళకు చెందిన బ్యూటీషియన్ షీలా సన్నీ జీవితంలో ఇన్నాళ్లకు ఓ ఆశాకిరణం కనిపించింది. తన జీవితాన్ని చిన్నాభిన్నం చేసిన తప్పుడు డ్రగ్స్ కేసులో కీలక వ్యక్తిగా భావిస్తున్న నారాయణ దాస్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంతో, నిజం నిగ్గు తేలుతుందన్న నమ్మకం ఆమెలో చిగురించింది.

**ఏం జరిగిందంటే?**

2023 ఫిబ్రవరి 27, సమయం మధ్యాహ్నం. త్రిశూర్ సమీపంలోని చాలకుడిలో ఉన్న తన బ్యూటీ పార్లర్‌లో షీలా సన్నీ ఎప్పటిలాగే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఇంతలో కేరళ రాష్ట్ర ఎక్సైజ్ అధికారుల బృందం హఠాత్తుగా పార్లర్‌లోకి ప్రవేశించింది. ఆమె హ్యాండ్‌బ్యాగ్, పార్లర్ బయట ఉన్న ఆమె టూ-వీలర్ స్టోరేజ్ కంపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించారు. నిషేధిత ఎల్ఎస్‌డీ (లైసెర్జిక్ యాసిడ్ డైథైలమైడ్) స్టాంపులను స్వాధీనం చేసుకున్నామని అధికారులు ప్రకటించారు. ఆ వెంటనే నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ ( చట్టం కింద షీలా సన్నీని అరెస్ట్ చేశారు.

తానేం చేశానో, తన బ్యాగులో, బండిలో ఆ స్టాంపులు ఎలా వచ్చాయో అర్థంగాక షీలా సన్నీ అయోమయంలో పడిపోయారు. తాను నిర్దోషినని ఎంత మొత్తుకున్నా ఫలితం లేకపోయింది. అలా ఆమె 72 రోజుల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఒక బ్యూటీ ప్రొఫెషనల్‌గా ఎంతో కష్టపడి సంపాదించుకున్న పేరు ప్రతిష్ఠలు మసకబారాయి.

**నిజం నిలబడింది.. కానీ..**



జైలు నుంచి బయటపడేందుకు ఆమె కుటుంబం చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అధికారులు స్వాధీనం చేసుకున్న స్టాంపులను రసాయన పరీక్షలకు పంపారు. ఆ పరీక్షల ఫలితాలు షీలా సన్నీ నిర్దోషిత్వాన్ని నిరూపించాయి. స్వాధీనం చేసుకున్న పదార్థంలో ఎల్ఎస్‌డీ లేదని తేలింది. దీంతో ఆమె జైలు నుంచి విడుదలయ్యారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉపాధి కోల్పోయారు, మానసికంగా తీవ్ర వేదనకు గురయ్యారు. అయితే, తనను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని నమ్మిన షీలా, న్యాయం కోసం పోరాడాలని నిశ్చయించుకున్నారు.

**కీలక నిందితుడి అరెస్ట్**

షీలా సన్నీ అరెస్ట్‌కు నారాయణ దాస్ అనే వ్యక్తి ఇచ్చిన తప్పుడు సమాచారమే కారణమని పోలీసులు గుర్తించారు. అయితే, అతను పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. కోర్టులు అతని పిటిషన్లను కొట్టివేయడంతో, పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. చివరకు సోమవారం బెంగళూరులో నారాయణ దాస్‌ను కేరళ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ వార్త తెలియగానే షీలా సన్నీ స్పందించారు. "నాకు అసలు పరిచయమే లేని ఆ దాస్ అనే వ్యక్తి అరెస్ట్ కావడం సంతోషంగా ఉంది. నా కోడలి సోదరితో కలిసి అతను బెంగళూరులో ఉంటాడని మాత్రమే నాకు తెలుసు" అని ఆమె అన్నారు. తన అరెస్ట్‌కు ముందు రోజు జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ, "నా అరెస్ట్‌కు ముందు రోజు నా కోడలు, ఆమె సోదరి మా ఇంటికి వచ్చారు. నేను వండిన భోజనం తిన్నారు. తర్వాత నా టూ-వీలర్ తీసుకుని కాసేపు బయటకు వెళ్లారు. వాళ్లిద్దరూ ఇంట్లో ఉన్నప్పుడు ఏదో రహస్యంగా మాట్లాడుకోవడం నేను గమనించాను" అని షీలా తెలిపారు.

**నా జీవితాన్ని ఎందుకు నాశనం చేశారు?**

"ఇప్పుడు దాస్‌ను అరెస్ట్ చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు. నా జీవితాన్ని ఎందుకు నాశనం చేశాడో, అసలు కారణం ఏంటో అతను చెప్పాలి. అదే నాకు కావాలి" అని షీలా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగినప్పటి నుంచి తన కుమారుడు కూడా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని, అతనితో తనకు ఎలాంటి సంబంధాలు లేవని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. "వాడు ఎందుకలా చేస్తున్నాడో నాకు తెలియదు. కానీ, పూర్తి నిజం ఏదో ఒక రోజు బయటకు వస్తుందని నేను నమ్ముతున్నాను" అని అన్నారు.

ఈ కష్టకాలంలో షీలా సన్నీకి ఆమె భర్త, కుమార్తె అండగా నిలిచారు. నెలల తరబడి అనుభవించిన మానసిక వేదన, నష్టాల తర్వాత, నారాయణ దాస్ అరెస్ట్‌తో తనకు న్యాయం జరుగుతుందనే ఆశ చిగురించిందని, పూర్తి నిజం కోసం ఎదురుచూస్తున్నానని షీలా సన్నీ పేర్కొన్నారు. ఈ కేసులో అసలు కుట్ర కోణం ఏమిటనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# ప్రధాని మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం



**హైదరాబాద్ పెన్ పవర్:**

అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై ఎన్డీఏ నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.

**అమరావతి ఆంధ్రప్రదేశ్ ప్రజల గర్వకారణం**

ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఉండాలని ఎలా అనుకుంటామో ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి కూడా రాజధాని ఉండాలి. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీఏ విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తెలంగాణకు హైదరాబద్, కర్నాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోంది. మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అమరావతిని నిర్మిస్తున్నాం. రాష్ట్రానికి అమరావతి ఆత్మ వంటిది.

**ప్రజల్ని తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. వారు ఇచ్చిన భూముల్లోనే రాజధాని నిర్మించడంతో పాటు తిరిగి వారికి రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తున్నాం. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయి. రోడ్ల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తాయి. అభివృద్ధిపై బురద జల్లే ప్రయత్నం చేస్తుంటాయి. మనం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు చేస్తున్న మంచి పనులను గురించి కూడా వివరించాలి.

ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు తెలియజేయాలి. ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమం, అభివృద్ధి బాటను వీడటం లేదు.

**హామీలు నెరవేర్చుకుంటూ ముందుకు**

అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ మెందుకెళ్తున్నాం. పోలవరానికి నిధులు, విశాఖ రైల్వేజోన్ మంజూరు, స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కేంద్రం కేటాయించింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే మత్స్యకారుల సేవలో, ఎస్సీ వర్గీకరణ, అన్నక్యాంటీన్లు, పింఛన్లు, 3 గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటు 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే నెల రైతులకు అన్నదాత కింద పెట్టుబడి సాయం అందిస్తాం.

**లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ**

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. 175 నియోజకవర్గాల్లోనూ రాబోయే రోజుల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి చేసి వన్ ఫ్యామిలీ... వన్ ఎంట్రప్రెన్యూర్ సాకారం దిశగా అడుగులు వేస్తాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. ఎరైన్-కో రామాయపట్నంలో, అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతున్నాయి. మిట్టల్ ప్లాంట్ పూర్తయితే రెండు స్టీల్ ప్లాంట్లు, దేశంలోనే ఎక్కువ స్టీల్ ఉత్పత్తి చేసే జిల్లాగా ఉమ్మడి విశాఖ రికార్డు సృష్టిస్తుంది. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. రాయలసీమకు బెంగళూరు, హైదరాబాద్ అనుసంధాన హైవేలు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉంటాయి. తద్వారా లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ మారుతుంది.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# పవర్ ప్లాంట్ ఘటననపై స్పందించిన ఎమ్మెల్యే



**నల్గొండ పెన్ పవర్ :** దామరచర్ల (మం) యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రమాదంపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పందించారు. ప్లాంట్ ను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై అధికారులతో ఆరాతీసారు. యూనిట్ వన్ లోని బాయిలర్ వద్ద గ్యాస్ కట్ ఒత్తిడికి గురై ఆయిల్ లీక్ కావడంతో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన మూడు బాయిలర్లు రన్ చేయడంలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. త్వరితగతన ప్రమాదానికి గురైన బాయిలర్ గ్యాస్ కట్ ను రిపేరు చేయాలని అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే. బాయిలర్ రిపేరు చేసి 24 గంటల్లోపు రన్నింగ్ లోకి తీసుకువస్తామని అధికారులు వెల్లడించారు. జరిగింది చిన్న ప్రమాదం ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు.

# సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్యుల కొరత తీర్చండి సార్





**హైదరాబాద్ పెన్ పవర్:**నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వైద్యుల కొరతను తీర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ను కోరారు.సోమవారం ఉదయం తిరుపతిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేరుకొని ఈ మేరకు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమది ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమని, తమిళనాడు సరిహద్దుగా ఉన్న వెనుకబడిన ప్రాంతమని, ఇటువంటి ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కలెక్టర్ కు వివరించారు.ఇప్పటికే ఈ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, అనస్తీషియా వైద్య నిపుణుల పోస్టు ఖాళీగా ఉందన్నారు. దీనికి తోడుగా మరో సీనియర్ డాక్టర్ ను పుత్తూరుకు బదిలీ చేయడం దారుణమన్నారు.ఈ సమస్యపై తక్షణం స్పందించి సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో ఖాళీ డాక్టర్ల పోస్టులను గుర్తించి, సరిపడా వైద్యులను నియమించి, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ కు విన్నవించారు.

# భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్: పెన్ పవర్ :** భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా పెండింగ్లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుందని, రైతుల భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.

సోమవారం వీణవంక మండలం చల్లూరులోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 రూపొందించిందని తెలిపారు. భూ భారతి చట్టం ప్రకారం సమస్యను సంబంధిత అధికారి ఎన్ని రోజులలో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. అధికారి పరిష్కరించిన భూ సమస్యపై సంబంధిత అర్జీదారు సంతృప్తి చెందని పక్షంలో అప్పీలు వ్యవస్థను ఈ చట్టంలో పొందుపరిచారని తెలిపారు. కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్ కు అధికారాలు కల్పించారని తెలిపారు.

గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. గతంలో తహసిల్దార్ స్థాయిలో పరిష్కారం అయ్యే చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని అన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు ఉండడంవల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల చిన్న సమస్యలు మండల స్థాయిలోనే త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు.

భూ భారతి చట్టం ప్రకారం ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. భూమికి భూదార్ సంఖ్య కేటాయింపునకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలు అరికట్టవచ్చని అన్నారు.

ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు. ధరణిలో ఇప్పటికే దరఖాస్తు చేసిన వారి సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భూ భారతిలో మ్యుటేషన్ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు. కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగం పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ క్షేత్రస్థాయిలో విచారించి రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రమేష బాబు, తహసిల్దార్ శ్రీనివాస్, వివిధ వర్గాల ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 30న శ్రీవారి సేవ జూన్ నెల కోటా ఆన్‌లైన్‌లో విడుదల

**విడుదల సమయ వివరాలు:**

తిరుపతి,

జనరల్ శ్రీవారి సేవ (తిరుమల మరియు తిరుపతి)

ఉదయం 11:00 గంటలకు

నవనీత సేవ (మహిళలకు మాత్రమే)

మధ్యాహ్నం 12:00 గంటలకు

పరకామణి సేవ (పురుషులకు మాత్రమే)

మధ్యాహ్నం 1:00 గంటలకు

గ్రూప్ లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించిన సేవ)

మధ్యాహ్నం 2:00 గంటలకు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు శ్రీవారి సేవ యొక్క నాణ్యతను మెరుగుపరిచి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో టీటీడీ అధికారులు శ్రీ సత్యసాయి సేవా సంస్థ (పుట్టపర్తి), ఇషా ఫౌండేషన్ (కోయంబత్తూర్), ఆర్ట్ ఆఫ్ లివింగ్ (బెంగళూరు) వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించి అధ్యయనం చేశారు.

ఈ అధ్యయనం ఆధారంగా శ్రీవారి సేవలో కొన్ని ముఖ్యమైన మార్పులను టీటీడీ తీసుకొచ్చింది. ఈ మార్పులు ఏప్రిల్ 30న కొత్తగా రూపొందించిన అప్లికేషన్ ద్వారా అమలులోకి రానున్నాయి.

**ముఖ్యాంశాలు**

**ఇకపై "గ్రూప్ లీడర్స్‌గా" సీనియర్ సేవకులు**

గత రెండు సంవత్సరాలుగా పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు సేవలో పాల్గొంటున్నారు. వయస్సు 45 సంవత్సరాలు నుంచి 70 సంవత్సరాల మధ్య ఉన్న వారు నమోదు కావచ్చు. ఇప్పుడు వీరిని "గ్రూప్ లీడర్స్" అని పిలుస్తారు. వీరు 15 రోజుల, ఒక నెల లేదా మూడు నెలల వ్యవధిలో సేవ చేయడానికి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవచ్చు.

**గ్రూప్ లీడర్స్ బాధ్యతలు**

ఈ గ్రూప్ లీడర్స్ శ్రీవారి సేవకుల పనిని పర్యవేక్షించడం, సేవకు వారి హాజరు తీసుకోవడం, మరియు ప్రతి ఒక్క సేవకుని/సేవకురాలి పనితీరును మూల్యాంకనం(%ఞఅస్త్ర%) చేయడం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు.

**పరకామణి సేవలో జనరల్ పురుష సేవకులకు అవకాశం.**

కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన పురుషులకు

పరకామణి సేవలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఈ మేరకు ఆన్ లైన్ ద్వారా పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చని తెలియజేయడమైనది.

# చరిత్రలో నిలిచిపోయ్యేలా బిఆర్ఎస్ రజతోత్సవ సభ




**హైదరాబాద్ పెన్ పవర్:** బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ కుంభమేళ తరహాలో జరిగిందని బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలంగాణ తొలి సిఎం కేసీఆర్ సభ చరిత్ర లో నిలిచిపోతుందని సభను విజయవంతం చేసినవారందరికి కృతజ్ఞతలు రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం ఆయన మాట్లాడుతూ...

తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ వెంట ఉన్నారని, మొన్నటి ఎన్నికల్లో మోసపోయామని , నిన్న ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ సభ నిరూపించిందన్నారు. రామగుండం నియోజకవర్గం ఒక ఉద్యమాల పురిటిగడ్డగా పేరొందిందని, ఉద్యమ సమయంలో ఏ పిలుపిచ్చిన ప్రభంజనంలా తరలివచ్చిన ప్రజానీకం నిన్నటి రజతోత్సవ సభకు 5 వేల మంది జనం ఈ ప్రాంతం నుండి తరలివచ్చి విజయవంతం చేసినందుకు, వారిని సభకు తరలించడంలో కష్టించిన మాజీ ప్రజా ప్రతినిధులకు, గులాబీ సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందని అన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠంపై గులాబీ జెండా ఎగురవేసే దిశగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీసి అడగాలన్నారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన రజతోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆరోజే కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తప్పుచేసామన్న భావనలో తెలంగాణ ప్రజానీకం ఉందని, మళ్ళీ కేసీఆర్ ను ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు.. ఈ విలేఖరుల సమావేశం లో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు,గోపు ఐలయ్య యాదవ్, కుమ్మరి శ్రీనివాస్, పాముకుంట్ల భాస్కర్, కల్వచర్ల కృష్ణవేణి,బోడ్డు రవీందర్ ముద్దసాని సంధ్యారెడ్డి, నీరటి శ్రీనివాస్, నారాయణదాసు మారుతి, అచ్చే వేణు,మెతుకు దేవరాజు, నూతి తిరుపతి సట్టు శ్రీనివాస్ బుర్ర వెంకన్న ఆవునూరి వెంకటేష్ కర్రీ ఓదేలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ బస్టాండ్‌లో పోలీస్ అవుట్‌పోస్ట్ ప్రారంభం



**హైదరాబాద్ పెన్ పవర్:**వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ బస్టాండ్‌లో చోటుచేసుకునే దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు సోమవారం ఒక పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభించింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ అవుట్‌పోస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి, ముఖ్యంగా దొంగతనాల నియంత్రణకు ఈ అవుట్‌పోస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో మరో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరినట్లు వెల్లడించారు.

ఈ పోలీస్ అవుట్‌పోస్ట్‌లో 24 గంటల పాటు పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఈ అవుట్‌పోస్ట్‌ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతేకాకుండా, జేబు దొంగల చిత్రాలను ప్రజలకు కనిపించేలా ప్రత్యేక బోర్డులపై ప్రదర్శిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులు దొంగతనం చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారని కమిషనర్ గుర్తు చేశారు. అతని వద్ద నుంచి 150 గ్రాముల బంగారం మరియు 10 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రయాణికులు తమ లగేజీ పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సై రాజన్న, ఆర్టీసీ అధికారులు ఎస్ భూపతి రెడ్డి డిప్యూటీ రీజనల్ మేనేజర్, ఆపరేషన్స్, కరీంనగర్ రీజియన్, డిపో మేనేజర్‌లు విజయ మాధురి, శ్రీనివాస్, బస్టాండ్ ఏటీఎం జి సురేష్, కార్గో మేనేజర్ రామారావు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో దారుణ హత్య...

### భార్య ముందే మరో యువకుడి గొంతు కోసి హత్య చేసిన భర్త

**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దపల్లి లో దారుణం జరిగింది. పట్టపగలు వ్యవసాయ మార్కెట్లో అప్పన్నపేటకు చెందిన పొలం కుమార్ ను దొంగతుర్తి గ్రామానికి చెందిన రైలుకుల సంతోష్ కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. విచక్షణ రహితంగా కత్తితో పొడిచాడు. కింద పడిపోయిన వ్యక్తిపై కసితీరా తన్నాడు. ఈ ఘటన హత్యకు పాల్పడ్డ వ్యక్తి భార్య కళ్ళేదుటే జరిగింది. భర్త కత్తితో కుమార్ ను పొడిచి చంపడంతో భార్య సొమ్మసిల్లి పడిపోయింది. హత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియక పోయినప్పటికీ కుటుంబ కలహాల నేపథ్యంలో మాట్లాడుకుందామని మార్కెట్ యార్డుకు ముగ్గురు చేరుకున్నట్లు సమాచారం. అయితే పథకం ప్రకారం సంతోష్ కుమార్ పై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు భావిస్తున్నారు. సంఘటన స్థలంలోనే ఉన్న ఉన్న హంతకున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. భార్య ముందే కుమార్ ను పొడిచి చంపడంతో స్థానికంగా కలకలం సృష్టిస్తుంది. సొమ్మసిల్లి పడిపోయిన సంతోష్ భార్య ను ఆసుపత్రికి తరలించారు.

## తిరుమలలో చెప్పుల తిప్పలకు చెక్..

## చెప్పుల స్టాండ్‌ల దగ్గర విడిచి వెళ్లండి..

## ఇకపై మీ చెప్పులు ఎక్కడికీ పోవు..!

**హైదరాబాద్ పెన్ పవర్:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్ళే భక్తులు ఎవరూ చెప్పులు ధరించరు. తిరు మాఢ వీధులలో కూడా భక్తులు చెప్పులు వేసుకుని నడవరు. శ్రీవారి ఆలయ పరిసరాలు, అన్నదానం ప్రాంతాలను భక్తులు అంత పవిత్రంగా భావిస్తారు. దీంతో తిరుమల వచ్చిన భక్తులకు చెప్పులు ఎక్కడ వదలాలి అన్నది పెద్ద టాస్క్ అని చెప్పాలి. అందుకోసం తిరుమలలోని పలు రద్దీ ప్రాంతాలలో టీటీడీ చెప్పుల స్టాండ్?లు ఏర్పాటు చేసింది. రాంబగీచా, అన్నదానం, ఏటీసీ సర్కిల్, కళ్యాణకట్ట తదితర ప్రాంతాలలో చెప్పుల స్టాండ్?లు ఉన్నాయి. అయినా తిరుమలలో చాలా ప్రాంతాలలో చెప్పులు కుప్పలు కుప్పలుగా కనిపిస్తుంటాయి. చెప్పుల స్టాండ్లు చూస్తే అదో పద్మవ్యూహాన్ని తలపిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి కాదేమో. అక్కడ చెప్పులు వదలడమేగాని తిరిగి వాటిని మనం కనుక్కోవడం అసాధ్యం.దీంతో.. ఈ చెప్పుల సమస్యపై టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి దృష్టి సారించారు. చెప్పుల సమస్యకు శాశ్వత పరిష్కారం ఆలోచించారు. ప్రస్తుతం టీటీడీ ఉచిత లగేజి కౌంటర్?లో ఉపయోగించే ఆర్ఎఫ్ఐడి సిస్టం అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టుగా ఏటీసీ సర్కిల్?లో ఒక కౌంటర్?ను ఏర్పాటు చేశారు. కౌంటర్ పనితీరును అధికారులతో కలిసి పరిశీలించారు. భక్తుల చెప్పులు వదిలి వెళ్లేటప్పుడు వారి ఫోటోతోపాటు మొబైల్ నెంబర్ ఫీడ్ చేసి స్లిప్ ఇస్తారు. చెప్పులను ఆర్ఎఫ్ఐడి ఉన్న బ్యాగ్ లో వేసి ర్యాక్ నెంబర్ ఆధారంగా స్కాన్ చేసి భద్రపరుస్తారు.భక్తులు దర్శనం అయ్యాక తిరిగి వచ్చి స్లిప్ చూపిస్తే స్కాన్ చేసి కౌంటర్?లో, ఏ వరుసలో ఏ ర్యాక్?లో ఆనంబర్ గల చెప్పులు ఉన్నాయో ఈజీగా గుర్తించి భక్తులకు తిరిగి అందిస్తున్నారు సిబ్బంది. అటు భక్తులను, ఇటు టీటీడీ సిబ్బంది నుంచి అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. 98 శాతం మంది భక్తులు తమ చెప్పులను తిరిగి తీసుకువెళుతున్నామని చెప్పారు. దీంతో నూతన విధానం విజయవంతంగా అమలవుతోందని, మరో నాలుగు ప్రాంతాలలో ఇదే తరహాలో చెప్పుల కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు.

# మాట ఇస్తే నిలబడతా...

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఎల్కతుర్తి సభలో కేసీఆర్ అంతా అక్కసే వెళ్లగక్కారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన రేవంత్ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కేసీఆర్ ఖజానాను లూటీ చేసి పోయి ఇప్పుడు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. తాను ఇంకా ఇరవై ఏండ్లు రాజకీయాల్లో ఉంటానని రేవంత్ నమ్మకం వ్యక్తం చేశారు. ప్రజలు పదేళ్లు చాన్స్ ఇస్తారని నమ్మకం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీష్ రావులను పిల్లగాళ్ళు అని కేసీఆర్ అన్నాడు. మరి వారినేందుకు అసెంబ్లీకి పంపిస్తున్నాడని ప్రశ్నించారు. సంవత్సరంన్నర నుండి పథకాలు తీసుకొచ్చాం. ఇప్పుడు వాటంన్నింటిని స్ట్రీమ్ లైన్ చేస్తున్నామని తెలిపారు. తాను చట్టప్రకారమే నడుచుకుంటానని..అరెస్టులు చేయమని డిమాండ్ వస్తోందని అరెస్ట్ చేయించలేనని స్పష్టం చేశారు. చేసిన పనులు చెప్పుకోవడంలో కొంత వెనకపడ్డామని. స్పీడప్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికార యంత్రాంగాన్ని స్ట్రీమ్ లైన్ చేశామని తెలిపారు. కొంత మంది అధికారుల తీరు గురించి తనకు తెలుసని అయినా తప్పనిసరి పరిస్థితుల్లో కొనసాగించాల్సి వస్తోందన్నారు. కేసీఆర్ మాటల్లో స్పష్టత లేదని.. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ పూర్తిగా ఖాళీ చేసి, ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని రేవంత్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతో తనకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని స్పష్టం చేశారు.అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ లాంటి నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు చివరి 6 నెలలు నా పాలనపై చర్చ జరుగుతుందని వ్యాఖ్యానించారు. నక్సలైటన్లను ఏరివేసే ఆపరేషన్ కగార్ అంశం పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని రేవంత్ అన్నారు. కగార్ పై మా పార్టీ నిర్ణయం తీసుకున్నాక ప్రభుత్వ విధానం ప్రకటిస్తామన్నారు. నేను కమిట్మెంట్ ఇస్తే చేసి తీరుతానని పార్టీ నేతలకు భరోసా ఇచ్చారు. అద్దంకి దయాకర్ కు ఎమ్మెల్సీ ఇస్తా అని చెప్పాను. ఇప్పించానన్నారు. అయితే కొంత మంది కాంగ్రెస్ నేతలు దారి తప్పుతున్నారని అన్నారు. పదవుల కోసం బ్లాక్ మెయిల్ చేసేలా మాట్లాడితే పదవులు రావన్నారు. నియోజకవర్గాల్లో తిరగండి అంటే హైదరాబాద్‌లో తిరుగుతున్నారని.. ఎమ్మెల్యే అయ్యాక మనోడు.. మందోడు అని ఉండదని స్పష్టం చేశారు. సీఎల్పీ సమావేశంలో అందర్నీ అప్రమత్తం చేస్తున్నా మార్పు రావడం లేదన్నారు. ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే పథకాలు ప్రజల్లోకి వెళతాయని అన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని హెచ్చరించారు.



# భూదాన్ భూముల అక్రమాల్లో సీనియర్ సివిల్ సర్వీస్ ఆఫీసర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణలో భూదాన్ భూముల అక్రమాలకు సంబంధించి కొంత మంది ఉన్నతాధికారులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది. ఈ వ్యవహారంలో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర ఉన్నతాధికారులు భూములను అక్రమంగా కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం 2025 ఏప్రిల్‌లో తెలంగాణ హైకోర్టు సీబీఐ , ఈడీ దర్యాప్తు ఎందుకు చేయకూడదని ప్రశ్నించింది. తాజాగా ఈ అంశంలో ఈడీ అధికారులు విచారణ చేస్తున్నారు. 1950లలో వినోబా భావే ఆధ్వర్యంలో పేద రైతుల కోసం భూములను సేకరించి పంపిణీ చేసే ఉద్యమం జరిగింది. ఈ భూములు భూదాన్ యజ్ఞ బోర్డు ఆధీనంలో ఉంటాయి మ. వీటిని అన్యాక్రాంతం చేయడం, విక్రయించడం చట్టవిరుద్ధం. నాగారం గ్రామంలో సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని భూదాన్ భూములు అక్రమంగా అమ్మకాలు, కొనుగోలు చేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియర్ ఐఏఎస్ అధికారులు , ఐపీఎస్ అధికారులు సహా మొత్తం 26 మంది ఉన్నతాధికారులు ఈ స్థలాలను కొనుగోలు చేసినట్లుగా చెబుతున్నారు. అధికారులు తమ పేర్లపై లేదా వారి కుటుంబ సభ్యుల పేర్లపై బినామీల ద్వారా భూములను రిజిస్టర్ చేసుకున్నారని కోర్టులో పిటిషన్ దాఖలయింది. భూదాన్ భూములు చట్టపరంగా అమ్మకాలు నిషిద్ధం అయినప్పటికీ తమకు ఉన్న అధికారాలతో అక్రమంగా కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.పిటిషన్ పై విచారణలో హైకోర్టు సర్వే నంబర్లు 181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మహేశ్వరం , ఎల్బీనగర్ సబ్-రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ భూములపై ఎలాంటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు లేదా మార్పులు చేయరాదని షరతు విధించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, భూదాన్ యజ్ఞ బోర్డు, సీబీఐ, ఈడీ, అధికారులు మరియు వారి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. ఈ అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఉండటం వివాదాస్పదమయింది. గతంలో ఈ భూములపై ఈడీ విచారణ చేసింది. ఐఎఎస్ అధికారి అమోయ్ కుమార్ ను పలుమార్లు విచారణకు పిలిచింది. డి. అమోయ్ కుమార్ రంగారెడ్డి , మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్‌గా ఉన్న సమయంలో భూదాన్ భూముల అక్రమాలు జరిగినట్లుగా ఈడీ గుర్తించింది. అమోయ్ కుమార్ ధరణి పోర్టల్‌లో భూమి యాజమాన్య రికార్డులను అక్రమంగా మార్చి, నిషేధిత జాబితాలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్‌లను సులభతరం చేశారని ఆరోపణలు ఉన్నాయి. - ధరణి పోర్టల్‌ను %దీ-నా% ప్రభుత్వం భూమి రికార్డుల డిజిటైజేషన్ కోసం ప్రవేశపెట్టింది. అయితే, అమోయ్ కుమార్ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసి, భూమి యాజమాన్య హక్కులను ప్రైవేటు వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వవ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండటంతో కేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందోనని ఆసక్తి ఏర్పడింది.

## కవులు సామాజిక చైతన్యపు రచనలు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**కవులు సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నార. సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో వనపర్తికి చెందిన ప్రముఖ పద్య కవి ఆకుల శివరాజలింగం రచించిన కొన్ని పుస్తకాలు జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ఐపీఎస్ చదివి పరవశించి ఆనందంతో కవి ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... సాహిత్యం సమాజ హితాన్ని కోరుతుంది కాబట్టి కవులు సమాజాన్ని చైతన్య పరిచే రచనలు చేయాలని కోరారు. ఆకుల శివరాజలింగం దాదాపు మూడున్నరు దశాబ్దాలపాటు హిందీ భాషోపాధ్యాయులుగా పనిచేశారని తన విశ్రాంత సమయంలో అటు విద్యార్థులకు ఉపయోగపడే రచనలే గాక తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలలో చక్కటి రచనలు చేశారని కొనియాడారు. సంగీతంలోను మంచి ప్రవేశమున్న ఆయన పలు భజన కీర్తనలు,హరికథలు రాసి తెలంగాణ వాగ్గేయకారుడుగా బెంగుళూరు తెలుగు సంఘం వారిచే అవార్డ్ ను అందుకున్నారని తెలిపారు. ఆకుల శివరాజలింగంను స్ఫూర్తిగా తీసుకొని వర్తమాన కవులు రచనలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, ఉమామహేశ్వర భజన మండలి సభ్యులు, టి, వెంకట్ రాములు, వై, నగేష్ యాదవ్, నరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పై ఏసీబీ దాడులు



**హైదరాబాద్ పెన్ పవర్:**శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో సోమవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ చీటింగ్ కేసులో ఫిర్యాదు దారుడు, అతని కార్యకర్తను తప్పించేందుకు శామీర్ పేట్ ఎస్ఐ పరశురామ్ నాయక్ లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఫిర్యాదు దారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. అప్పటికే 2 లక్షల రూపాయలు లంచం ఇచ్చాడు. సోమవారం మరో 22 వేల రూపాయలు ఇస్తుండగా ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్ 2 అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. దీంతో ఎస్ఐ పరశురామ్ పై కేసు నమోదు చేసి ప్రత్యేక న్యాయ మూర్తి ఎదుట హాజరు పరిచారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా లేదా వాట్స్ అప్ నంబర్ 9440446106 సమాచారం అందించాలని ఏసీబీ అధికారులు సూచించారు.

## హైదరాబాద్ లో ఐటీ రైడ్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పాతబస్తీలో ఈడీ ఆకస్మిక దాడులు చేపట్టింది. సంతోష్ నగర్, యాకుత్ పురా సహా నగరంలోని మొత్తం 8 ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు విస్తృత స్థాయిలో సోదాలు చేస్తున్నారు. భూదాన్ భూముల వ్యవహారంలో %జుణ% సోదాలు చేపట్టింది. మహేశ్వరం భూముల విషయంలో తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం.పాతబస్తీలోని మన్నార్ ఖాన్, ఖదీర్ ఉన్నిస్, సర్ఫాన్, సుకూర్ ఇళ్లలో, పలువురు ఐఏఎస్, అధికారుల ఇళ్లల్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఈఐపీఎల్ కంపెనీ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ లకు భూములు విక్రయించింది. ఈ కంపెనీకి సుకూర్ బినామీగా ఉండగా అతడి నివాసంతో పాటు అతడి సన్నిహితులు సర్ఫాన్, మరికొందరి ఇళ్లలో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. భూదాన్ భూముల కొనుగోలు వ్యవహారంలో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ తో పాటు మహేశ్వరం ఎమ్మార్వోను ఈడీ అధికారులు విచారించారు. వారిని ప్రశ్నించి స్టేట్మెంట్ తీసుకున్నారు.